

అన్నదాతలకు 'యంత్ర'లాభం

ట్రాక్టర్‌కు స్ట్రాబేలర్ యంత్రాన్ని అమర్చి, గడ్డిని సేకరించడం ఇటు రైతులకు, అటు కొనుగోలుదారులకు లాభదాయకంగా ఉంటోంది.


8లో



ఆలయ పునర్నిర్మాణానికి రూ.లక్ష

సఖినేటిపల్లి: గొంది గ్రామంలోని ఆదివీర్లమ్మ, కనకదుర్గమ్మ, మావుళ్లమ్మ, పుంతలో మునలమ్మ అమ్మవార్ల ఆలయ పునర్నిర్మాణానికి నల్లా విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ (ఉండి) రూ.లక్ష విరాళం అందజేసింది.

డెల్టాలకు 9,375 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 9,375 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

23న మినీ జాబ్‌మేళా

పి.గన్నవరం: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పి.గన్నవరం లక్ష్మీ ఐటీఐ కళాశాలలో ఈ నెల 23వ తేదీ ఉదయం మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా అధికారి డి.హరిశేషు తెలిపారు. మూడు కంపెనీల్లో 62 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. పదో తరగతి నుంచి పీజీ వరకూ చదివిన వారికి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వివరాల కోసం సెల్ 82476 45389 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హరిశేషు విజ్ఞప్తి చేశారు.

26 నుంచి సీపీఐ శత వార్షికోత్సవాలు



'సీపీఐ శత వార్షికోత్సవం- కమ్యూనిజం' సంచికను విడుదల చేస్తున్న పార్టీ నాయకులు

అమలాపురం టౌన్: సీపీఐ 100వ ఆవిర్భవ శత వార్షికోత్సవాలను ఈనెల 26వ తేదీ నుంచి ఘనంగా నిర్వహించుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.ప్రభాకర్ పిలుపునిచ్చారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సీపీఐ పార్టీ ఆవిర్భవించిందని వివరించారు. పార్టీ జాతీయ కార్యవర్గం వందేళ్ల పండుగను 2025 సంవత్సరమంతా జరుపుకావాలని పిలుపునిచ్చిందని చెప్పారు. మన రాష్ట్రంలో ఈ నెల 26వ తేదీ నుంచి 2025 జనవరి 1వ తేదీ వరకూ శత వార్షికోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్ భవనంలో పార్టీ నాయకుడు కె.రామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం జరిగిన పార్టీ జిల్లా సమితి సమావేశంలో ప్రభాకర్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సీనియర్ నేత దేవా రాజేంద్ర ప్రసాద్ పార్టీ వందేళ్ల చరిత్ర వివరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు మాట్లాడుతూ ఈ నెల 27న ముమ్మిడివరం నియోజకవర్గంలో పార్టీ శత వార్షికోత్సవాల ప్రారంభ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు సీపీఐ శత వార్షికోత్సవం -కమ్యూనిజంపై ముద్రించిన సంచికను విడుదల చేశారు. పార్టీ నాయకులు నిమ్మకాయల శ్రీనివాసరావు, గెద్దం ప్రభాకర్, రాము, నల్లి బుజ్జి, శీలం వెంకటేష్, వనచర్ల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సమర్థంగా సహిత విద్య

ఆర్‌జేడీ నాగమణి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి

ముమ్మిడివరం: విభిన్న ప్రతిభావంతులకు భవిత కేంద్రాల ద్వారా అందించే సహిత విద్యను సమర్థంగా అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణి పిలుపునిచ్చారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో డీఈఓ షేక్ సలీంబాషా అధ్యక్షతన శుక్రవారం మండల విద్యాశాఖాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. సహిత విద్యను అమలు చేసేందుకు ఉన్నత పాఠశాలల్లో నియమించిన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు జాబ్‌చార్ట్ ప్రకారం విధులు నిర్వహించేలా పర్యవేక్షణ చేయాలన్నారు. డీఈఓ డాక్టర్ సలీంబాషా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 22 భవిత కేంద్రాల ద్వారా ఐఈఆర్‌పీలు, దివ్యాంగ చిన్నారులకు అందుతున్న సేవలు సక్రమంగా అందేలా ఎంఈఓలు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. సహిత విద్య స్టేట్ కన్సల్టెంట్ వై.నరసింహ సహిత విద్యకార్యక్రమాల అమలు తీరును వివరించారు. జిల్లా కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడారు.

పది పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి

వచ్చే సంవత్సరం మార్చి 17నుంచి ప్రారంభమయ్యే పది పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలని ఆర్‌జేడీ జి.నాగమణి పిలుపు నిచ్చారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. పదవ తరగతి ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఉప విద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశరావు, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు బీవీవీ సుబ్రమణ్యం, డి.రమేష్‌బాబు, డా.ఎంకే బీమారావు, ఎంవీవీ సత్యనారాయణ, ఏఎస్ఓ కొమ్ముల నారాయణరావు పాల్గొన్నారు.

రేపు నిరుద్యోగులకు సదస్సు

రామచంద్రపురం: జీవితంలో స్వయం ఉపాధి ద్వారా స్థిరపడాలనుకునే నిరుద్యోగులకు ఆదివారం స్థానిక వీఎస్ఎం కళాశాలలో అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు నిపుణులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

చదువులకు చంద్ర గ్రహణం

- కూటమి సర్కారు ఏలుబడిలో కుంటుపడిన పాఠశాల, కళాశాల విద్య
- ఎన్నికల్లో హామీ ఇచ్చి ఇప్పుడు తల్లికి వందనం ఊసే ఎత్తని పాలకులు
- పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు
- ఆగిన వసతి దీవెన, విద్యా దీవెన సొమ్ము మంజూరు
- ట్యాబ్‌ల పంపిణీ లేదు.. బైజూస్ పాఠాలూ లేవు
- వైఎస్సార్ సీపీ హయాంలో ఐదేళ్లూ ప్రభుత్వ విద్యకు స్వర్ణయుగం
- మాజీ సీఎం జగన్ ముందుచూపును గుర్తు చేసుకుంటున్న తల్లిదండ్రులు



కపిలేశ్వరపురం మండలం వల్లూరులో అసంతృప్తిగా నిలిచిపోయిన నాడు-నేడులో చేపట్టిన పాఠశాల భవనం

సాక్షి, అమలాపురం: 'పేదింటి పిల్లలు అంతర్జాతీయ విద్యా వేదికలపై తమ సత్తా చాటాలి. అలా చేయాలంటే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆధునిక విద్య ప్రతి ప్రభుత్వ పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థికి అందాలి'' అన్నదే మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. ఇందుకు అనుగుణంగా పేద, మధ్య తరగతి విద్యార్థులు ఎక్కువ మంది చదువుకునే పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో నాడు–నేడులో ఆధునీకరించారు. మౌలిక సదుపాయాలు కల్పించడం, మధ్యాహ్న భోజన మెనూను సమూలంగా మార్పులు చేసి నాణ్యమైన ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడం, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో బైజూస్ సంస్థతో ఒప్పందాలు చేసుకున్నారు. ఏటా డిసెంబర్ 21న తన పుట్టినరోజు సందర్భంగా జగన్ 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసేవారు. పాఠాలు చెప్పించడం, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అమ్మ ఒడిని ఏటా క్రమం తప్పకుండా అమలు చేయడం, వసతి దీవెన, విద్యా దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్.. ఇలా చెప్పుకుంటూ పోతే సీఎంగా జగన్ ఉన్న ఐదేళ్లూ ప్రభుత్వ విద్యను స్వర్ణయుగంగా మార్చారని తల్లిదండ్రులు ఆయన ముందుచూపును గుర్తు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి తల్లకిందులైంది. ప్రభుత్వ విద్యకు గ్రహణం పట్టించింది.

జగన్ హయాంలో 'ప్రభుత్వ విద్యకు స్వర్ణయుగం'

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాం నిరుపేద, మధ్య తరగతి విద్యార్థులకు ఒక స్వర్ణయుగం. జిల్లాలో బైజూస్ ట్యాబ్స్‌ను అందించారు. 2022–23 విద్యా సంవత్సరంలో 14,561 మంది విద్యార్థులకు, 2023–24 విద్యా సంవత్సరంలో 13,340 మంది విద్యార్థులకు ట్యాబ్స్ అందజేశారు.

▶▶ పాఠశాలల్లో డిజిటల్ విద్యలో భాగంగా 2022–23లో 191 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు 264 స్మార్ట్ టీవీలు, 142 ఉన్నత పాఠశాలలకు 951 ఐఎఫ్‌పీ ప్యానల్స్‌ను అందజేశారు. 2023–24లో 197 ఉన్నత పాఠశాలలకు 873 ఐఎఫ్‌పీ ప్యానల్స్ ఇచ్చారు.

▶▶ అమ్మఒడి పథకంలో భాగంగా తల్లి ఖాతాలో 2019–20 విద్యా సంవత్సరంలో 1,47,994 మందికి రూ.206.991 కోట్లు, 2020–21 విద్యా సంవత్సరంలో 1,44,797 మంది తల్లుల ఖాతాల్లో 217.196 కోట్లు జమ చేశారు. 2021–22 విద్యా సంవత్సరంలో 1,45,462 మంది తల్లుల ఖాతాల్లో 218.193 కోట్లు, 2022–23 సంవత్సరానికి రూ.1,38,833 మందికిగాను రూ.180.48 కోట్లు తల్లుల ఖాతాలో జమ చేశారు.

▶▶ జిల్లాలో మనబడి నాడు–నేడు పథకం ఫేజ్–1లో 436 పాఠశాలలను రూ.104.96 కోట్లతో అభివృద్ధి చేశారు. ఫేజ్–2లో 761 పాఠశాలలు, 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ.257 కోట్లు మంజూరయ్యాయి. ఎస్ఎంఎఫ్ (స్కూల్ మెయింటినెన్స్ ఫండ్) కేటాయించి పాఠశాలలో చిన్నచిన్న పనులకు రూ.27.76 కోట్లు విడుదల చేశారు.

▶▶ జగనన్న గోరుముద్దలో 1,05,698 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరింది. వారానికి ఐదు రోజులు కోడిగుడ్డు, మూడు రోజుల 25 గ్రాముల బరువు ఉన్న చిక్కీ, మిగిలిన మూడు రోజులు రాగి జావ అందజేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో 2,685 మంది కుక్ కమ్ హెల్పర్లు విధులు చేపడుతున్నారు. హెల్పర్‌కు నెలకు రూ.3 వేల వంతున ప్రభుత్వం చెల్లించేలా ఏర్పాటు చేశారు.

▶▶ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్యక్రమానికి 1,689 మందిని శానిటేషన్ ఆయాలుగా నియమించారు. వీరికి ప్రతి నెలా రూ.6వేల గౌరవ వేతనం అందజేశారు. నాడు–నేడులో మరుగుదొడ్లను ఆధునీకరించారు.

▶▶ ప్రతి ఏటా క్రమం తప్పకుండా పాఠశాల ప్రారంభం రోజునే జగనన్న విద్యాకానుక అందజేశారు. జేవీకే కిట్‌లో మూడు జతల యూనిఫామ్స్, నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాలు, రెండు జతల సాక్స్‌లు, ఒక జత షూ, బెల్ట్, స్కూల్ బ్యాగ్, డిక్షనరీలు అందజేశారు.

▶▶ జిల్లాలో 2023–24లో జగన్న విదేశీ విద్య పథకానికి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి రూ.62,64,256 మంజూరయ్యింది.

▶▶ జగనన్న వసతి దీవెన పథకంలో భాగంగా 2022 ఏప్రిల్‌లో 9,591 మంది విద్యార్థులకు రూ.8,94,45,000 విడుదల చేయగా, 2022–23 విద్యా సంవత్సరంలో రూ.7,90,97,500 ఇచ్చారు.

▶▶ జగనన్న విద్యా దీవెన పథకంలో భాగంగా 2022 మేలో 10,231 మంది విద్యార్థులకు రూ.7,75,30,374, 2022 ఆగస్టులో 10,321 మంది విద్యార్థులకు రూ.6,24,00,163, 2022 డిసెంబరులో 10,498 మంది విద్యార్థులకు రూ.6,63,09,729 విడుదల చేశారు. 2022–23 విద్యా సంవత్సరంలో 2023 మార్చిలో 8,733 మంది విద్యార్థులకు 8,47,71,371, అదే ఏడాది మేలో 297 మంది విద్యార్థులకు రూ.35,27,944, అదే ఏడాది ఆగస్టులో 8,673 మంది విద్యార్థులకు 6,60,84,254, అదే ఏడాది డిసెంబరులో 9,568 మంది విద్యార్థులకు రూ.7,04,40,994 విడుదల చేశారు. 2023–24 విద్యా సంవత్సరంలో మొదటి విడతగా మార్చిలో 8,824 మంది విద్యార్థులకు రూ.6,14,77,716 విడుదల చేశారు.

కూటమి హయాంలో ప్రభుత్వ విద్యకు తూట్లు

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పాఠశాల విద్యార్థులకు ఇస్తామన్న ట్యాబ్‌ల ఊసేలేదు. బైజూస్ పాఠాలు నిలిచిపోయాయి. అమ్మ ఒడికి తల్లికి వందనం అని పేరు మార్చారు కాని ఇంత వరకు తల్లుల ఖాతాలో సొమ్ము వేయలేదు. కూటమి నేతలు ఇచ్చిన హామీ ప్రకారం జిల్లాలో సుమారు 2.08 లక్షల మందికి తల్లికి వందనం ఇవ్వాల్సి ఉంది.

▶▶ పాఠశాలల్లో నాడు– నేడు రెండవ దశ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. రెండవ దశలో చేపట్టిన పనుల్లో ఇప్పటి వరకు 57 పాఠశాలల్లో మాత్రమే పూర్తయ్యాయి. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తరువాత పనులు దాదాపుగా నిలిచిపోయాయి.

▶▶ 1,573 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో కుక్, హెల్పరుగా పని చేస్తున్నవారికి కుకింగ్ చార్జీలు అందించాల్సి ఉంది. పాఠశాలలో 1,660 మంది పారిశుద్ధ్య కార్మికులకు రూ.4.98 కోట్లు, 212 మంది నైట్ వాచ్‌మన్‌లకు గౌరవ వేతనం బకాయి ఉంది.

పాఠశాల విద్య కుంటుపడుతోంది



మెగా డీఎస్సీ ప్రకటించిన ప్రభుత్వం కసరత్తు పేరుతో ఆలస్యం చేయడం మంచిది కాదు. ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినా ప్రయోజనం లేదు. ఉపాధ్యాయుల కొరత వల్ల పాఠశాలల్లో విద్య కుంటుబడుతోంది. పాఠశాలలో ఆధునిక విద్యను పునరుద్ధరించాల్సి ఉంది. ఫీజుల రీయింబర్స్‌మెంట్ చేయకపోవడం అన్యాయం.

– ఇళ్ల వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆటలు



ఫీజులు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుతోంది. ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఫీజుల బకాయిల పేరుతో వారిని పరీక్షలకు హాజరు కానివ్వబోమని యాజమాన్యాలు చెబుతున్నాయి. విద్యార్థులు నలిగిపోతున్నారు.

– జి.రవికుమార్, ఏఐఎస్ఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, అమలాపురం



గత ఏడాది వైఎస్సార్ సీపీ హయాంలో ముమ్మిడివరం మండలం అనాతవరం ఉన్నత పాఠశాలలో అందించిన ట్యాబ్‌లతో విద్యార్థులు



నాడు-నేడులో కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేసిన పి.గన్నవరం జెడ్పీ హైస్కూల్

పంటపై 60 శాతం రుణం

కలెక్టర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: జిల్లావ్యాప్తంగా సాగులో ఉన్న వివిధ పంటల రాబడిపై 60 శాతం రుణాలు పొందే విధంగా రుణ పరిమితులను నిర్ధారించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ 2025– 26 సమావేశాన్ని కలెక్టర్ మహేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ శాఖలైన ఉద్యాన పశు సంవర్ధకం, మత్స్య, శాఖలకు సంబంధించిన రుణ పరిమితులను జిల్లా స్థాయిలో సాంకేతిక కమిటీ ప్రతిపాదించిందన్నారు. ఉత్పాదక వ్యయంలో కనీసం 60 శాతం పంట రుణాలుగా అందించేందుకు ఆయా అంశాల క్రింద స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పరిమితులను కమిటీ నిర్ణయించిందన్నారు. ప్రధానంగా వరి పంటకు సంబంధించి ఎకరాకు ఖరీఫ్‌లో రూ.49,820, రబీలో రూ.56,262 రుణ పరిమితులుగా నిర్ణయించారు. పశుసంవర్ధక శాఖ ద్వారా లబ్ధిదారులకు పాడి గేదె ఒక్కంటికి రూ.1.20 లక్షలు పాడి ఆవులకు రూ.లక్ష వర్కింగ్ క్యాపిటల్‌గా నిర్ణయించారు. మొక్కజొన్న రబీలో సాగుకు ఎకరాకు రూ.35, 850, పప్పు దినుసులు సాగుకు ఎకరాకు రూ.22,700 గా రుణ పరిమితిని ప్రతిపాదించామన్నారు. డీసీసీబీ కార్యనిర్వాహక అధికారి ఆర్‌వీ నరసింహరావు, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకట్రావు, జిల్లా మత్స్య శాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ, నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్, స్వామి నాయుడు, లీడ్ బ్యాంకు మేనేజర్ కేశవ వర్మ, ఎస్‌బీఐ డిప్యూటీ రీజనల్ అధికారులు పాల్గొన్నారు.

పనితీరు మెరుగుకు చర్యలు

వ్యవసాయ పశుసంవర్ధక శాఖల పనితీరు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ పశుసంవర్ధక శాఖ వైద్యులు ల్యాబ్ టెక్నీషియన్లతో సమావేశం నిర్వహించి ఏడు నియోజకవర్గాలలో ఉన్న డయాగ్నోసిస్ ల్యాబొరేటరీల పనితీరు పై ఆరా తీశారు. వాటికి అవసరమైన మరమ్మతు పనులకు అంచనాలు రూపొందించాలని పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈని ఆదేశించారు. జేసీ టి.నిషాంతి, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు రీ యింబర్స్ చేయాలి



ఆర్డీవో మాధవికి వినతి పత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా ప్రతినిధులు ఆర్డీవో కె.మాధవికి శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సతీష్, సందీప్ తదితరులు ఆర్డీవోకు విద్యార్థులు పడుతున్న అవస్థలను వివరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు వసతి దీవెన పెండింగ్ నిధులు కూడా విడుదల చేయాలని కోరారు. గతంలో ప్రతి విద్యా సంవత్సరంలో విద్యార్థులకు నాలుగు క్వార్టర్ల రూపంలో డబ్బు జమ అయ్యేదని ఆ వినతిపత్రంలో గుర్తు చేశారు. గత సంవత్సరం విద్యార్థులకు కేవలం ఒక్క క్వార్టర్ మాత్రమే విడుదల చేసి మిగిలిన మూడు క్వార్టర్లకు విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9.5 లక్షల మంది విద్యార్థులు డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ చదువుతున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మూడు క్వార్టర్స్‌కు రాష్ట్రవ్యాప్తంగా రూ.2,100 కోట్లు విడుదల కావాల్సి ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక, సర్టిఫికెట్లు తీసుకోలేక ఇబ్బందులకు గురువుతున్నారన్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్ పరీక్షలు వచ్చే నెల నుంచి మొదలవుతున్నాయని గుర్తు చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజులు చెల్లిస్తేనే వారికి పరీక్షలు రాసేందుకు అనుమతులు ఇస్తామని ఆయా కళాశాలల యాజమాన్యాలు అంటున్న క్రమంలో విద్యార్థులు ఆందోళనలో పడ్డారని ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు ఆర్డీవోకు వివరించారు.

విద్యార్థి భవితకు ఇదే ప్రాతిపదిక

- టెన్త్ నామినల్ రోల్స్ సవరణకు 23 వరకు అవకాశం
- పొరపాట్లకు తావివ్వొద్దన్న పరీక్షల విభాగం



పదవ తరగతి విద్యార్థులు

రాయవరం: ఉన్నత చదువులకు, ఉద్యోగ దరఖాస్తులకు పదవ తరగతి ఉత్తీర్ణత పొందిన సర్టిఫికెట్‌నే ప్రాతిపదికగా తీసుకుంటారు. విద్యార్థి బంగారు భవిష్యత్తుకు బాట వేసేది పదవ తరగతి. అందుకే టెన్త్ సర్టిఫికెట్లలో పొరపాట్లు లేకుండా నామినల్ రోల్స్‌ను రూపొందించాల్సిన అవసరం ఉంది. మరో మూడు నెలల్లో విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనుండగా..ప్రస్తుతం నామినల్ రోల్స్ తయారు చేసే పనిలో ప్రధానోపాధ్యాయులున్నారు.

డిజిటలైజేషన్ నామినల్ రోల్స్

పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల వివరాలను ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో ఇప్పటికే సమర్పించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పేర్లు, కులం, ఆదాయం, నివాస ప్రాంతం, ఆధార్‌కార్డు నంబరు తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు, పరీక్ష ఫీజును కూడా చెల్లించారు. విద్యార్థుల వివరాల నమోదులో ఏ చిన్న పొరపాటు జరిగినా అది వారి భావి జీవితానికి గ్రహపాటుగా నిలుస్తుంది. అందుకే నామినల్ రోల్స్ విషయంలో ఏ చిన్న పొరపాటుకు తావు లేకుండా వ్యవహరించాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసిన విద్యార్థుల నామినల్ రోల్ వివరాలను మాన్యువల్ కాపీలో కూడా జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో సమర్పించేవారు. గత విద్యా సంవత్సరం నుంచి మాన్యువల్ కాపీలు సమర్పించనవసరం లేదంటూ ప్రభుత్వ పరీక్షల విభాగం ఆదేశాలు జారీ చేసింది.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 388 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలున్నాయి. ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 240 పాఠశాలలుండగా, ప్రైవేట్ యాజమాన్య పరిధిలో 148 పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల నుంచి 19,454 మంది పదవ పరీక్షలు రాసేందుకు ఫీజు చెల్లించారు. 9,726 మంది బాలురు, 9,728 మంది బాలికలున్నారు.

ఎడిట్‌కు అవకాశం

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల వివరాలను ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్ చేశారు. ఆన్‌లైన్‌లో పది నామినల్ రోల్స్ సమర్పణలో ఏమైనా పొరపాట్లు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం ఈ నెల 23వ తేదీ వరకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చింది.

ఆ 362 మంది విద్యార్థులు ఎక్కడ?

పరీక్ష ఫీజు అపరాధ రుసుం రూ.500తో ఫీజు కట్టడానికి గడువు ఈ నెల 16తో ముగిసింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో నమోదైన విద్యార్థుల్లో 362 మంది ఫీజు చెల్లించలేదు. వారిలో 240 మంది బాలురు, 122 మంది బాలికలున్నారు. వీరు పరీక్ష ఫీజు ఎందుకు చెల్లించలేదంటూ విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రధానోపాధ్యాయుల ద్వారా ఆరా తీస్తున్నారు. ఫీజు కట్టని వారిలో జిల్లా పరిషత్ విద్యార్థులే అధికంగా ఉన్నారు.

తప్పులకు అవకాశం లేకుండా..



ఆన్‌లైన్‌లో నామినల్ రోల్స్ సబ్మిట్ చేసే సమయంలో ప్రధానోపాధ్యాయులు తప్పులకు అవకాశం లేని విధంగా చూడాల్సిందిగా ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. ఒకటికి రెండుసార్లు వివరాలు సరిచూసుకుని సబ్మిట్ చేస్తే ఇబ్బంది ఉండదు. పేరెంట్స్ నుంచి కూడా డిక్లరేషన్ తీసుకోవాలని హెచ్ఎంలకు సూచించాం.

– డాక్టర్ షేక్ సలీం భాషా, డీఈవో, అమలాపురం

ఆదిలోనే హంసపాదు

- రబీ నారుమడులను ముంచేసిన వర్షాలు
- చల్లదనానికి మొలకెత్తని విత్తనాలు

ఉప్పలగుప్తం: బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్ప పీడన ద్రోణి ప్రభావంతో గురు, శుక్రవారాల్లో జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో ఖరీఫ్ కోత కోసిన పనులు.. ధాన్యం తడిసిపోవడంతోపాటు రబీ నారుమడులు దెబ్బతిన్నాయి. జిల్లాలో శుక్రవారం ఉదయం భారీ వర్షం కురిసింది. అంబాజీపేట, అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన వంటి మండలాల్లో వర్షం పడింది. ముంపునకు భయపడి సముద్ర తీర ప్రాంతాల్లో ఖరీఫ్ సాగు చేయని రైతులు రబీపై ఆశలతో నారుమడులు వేశారు. ఈ మడులు గత రెండు రోజుల వర్షాలకు మునిగిపోయాయి. దీంతో రైతులు నారుమడిలో ముంపు నీరు దిగువకు వదిలేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. నీరు దిగే అవకాశం లేక బకెట్లు.. మగ్గులతో నీరు బయటకు తోడుతున్నారు. వెంటవెంటనే మరోసారి వర్షం కురుస్తుండడంతో నీరు తోడడానికి వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ ఎలాగూ పండలేదు. కనీసం రబీ అయినా పండితే సొమ్ము కళ్ల జూడవచ్చని ఆశించిన రైతులకు మొదట్లోనే వర్షాల రూపంలో తగులుతున్న దెబ్బ ఇబ్బందులు పాల్జేస్తోంది. వాతావరణంలో ఏర్పడిన తేమ, మంచు ప్రభావాలతో చల్లని గాలులకు విత్తనం పూర్తి స్థాయిలో మొలకెత్తడంలేదని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,500
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	10,000 – 11,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

దింపు కార్మికుడి మృతి


కముజు వెంకటరావు (ఫైల్)

ముమ్మిడివరం: మండలంలోని చినకొత్తలంకకు చెందిన దింపు కార్మికుడు కొబ్బరి చెట్టు పైనుంచి జారి పడి మృతిచెందాడు. గ్రామా నికి చెందిన కముజు వెంకటరావు(59) గురువారం అదే గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో దింపు తీస్తుండగా ప్రమాదవశాత్తూ చెట్టుపై నుంచి జారి పడిపోవడంతో తలకు, వెన్నుపూసకు బలమైన గాయాలయ్యాయి. గాయపడిన వెంకటరావును 108 అంబులెన్స్‌లో అమలాపురం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. మృతునికి భార్య విజయలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అన్నదాతకు యంత్రలాభం



- స్ట్రాబేలర్‌తో సులువుగా ఎండుగడ్డి సేకరణ
- క్రమంగా తీరుతున్న పశుగ్రాసం కొరత

అలమూరు: వ్యవసాయంలో వరి కోత యంత్రాల వాడడంతో పశుగ్రాసానికి ఉపయోగించే ఎండుగడ్డి నిరుపయోగంగా మారుతోంది. దీనివల్ల పాడిరైతులను ఎండి గడ్డి కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీనిని నివారించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విరివిగా స్ట్రా బేలర్ యంత్రాలను రాయితీపై అందించింది. అప్పటి వరకూ రైతులు ఇతర జిల్లాల నుంచి స్ట్రాబేలర్ యంత్రాలను తీసుకువచ్చి ఎండు గడ్డిని సేకరించేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాయితీ ఇవ్వడంతో స్థానికంగా లభ్యమయ్యే స్ట్రాబేలర్ యంత్రాల సాయంతో ఎండుగడ్డిని సేకరిస్తున్నారు. ట్రాక్టర్‌కు దమ్ము చక్రాలు అమర్చినట్టుగానే స్ట్రాబేలర్ యంత్రాన్ని వినియోగించి గడ్డి సేకరణ జరుపుతుండటం వల్ల ఇటు రైతులకు, అటు కొనుగోలుదారులకు లాభదాయకంగా ఉంటోంది. గతంలో స్థానికంగా ఉండే పాడి రైతులు ఒకవేళ గడ్డిని సేకరిద్దామనుకున్నా వ్యయ ప్రయాసలు ఎక్కువగా ఉండటం వల్ల యంత్రంతో కోసిన వరి గడ్డిని పొలంలోనే వదిలేసి నిప్పు పెట్టేవారు. దీంతో ఎండుగడ్డి కొరత ఎక్కువై ఏటా ధర పెరుగుతూ వస్తోంది. మరి కొంతమంది రైతులు పెట్టుబడి ఎక్కువైనా కూలీలతో కోయించి వరిగడ్డిని భద్రపరచుకుంటున్నారు. ఇలాంటి తరుణంలో గోసంరక్షణ కేంద్రాలకు, డెయిరీఫాంలకు, పేపర్ మిల్లులకు ఎండుగడ్డి సేకరణ కష్టంగా మారింది. దీంతో వారంతా స్ట్రాబేలర్ యంత్రాలను తీసుకువచ్చి ట్రాక్టర్ సాయంతో పొలాల్లో వ్యర్థంగా పడి ఉన్న ఎండుగడ్డిని సేకరించి తీసుకువెళుతున్నారు. తమ పొలాల్లో లభ్యమయ్యే ఎండుగడ్డికి అధిక ధర లభ్యం కావడంతో అనేకమంది రైతులు సమీప పేపరుమిల్లులకు విక్రయాలు జరుపుతున్నారు, దీనివల్ల స్థానికంగా లభ్యమయ్యే ఎండుగడ్డికి విపరీతమైన డిమాండ్ ఏర్పడడంతో పాడి రైతులను తరచూ ఎండు గడ్డి కొరత వేధిస్తోంది. ఈ స్ట్రాబేలర్ యంత్రాల పనితీరును గుర్తించిన స్థానిక రైతులు రాయితీపై గతంలో మాదిరిగా ఇవ్వాలని వ్యవసాయశాఖకు విజ్ఞాపనలు చేస్తున్నారు.


పెదపళ్లలో గడ్డిని సేకరిస్తున్న స్ట్రాబేలర్ యంత్రం


స్ట్రాబేలర్ సాయంతో సేకరించిన గడ్డి మోపులను తరలిస్తున్న దృశ్యం


వరి చేనులో స్ట్రాబేలర్ యంత్రం తయారు చేసిన గడ్డి మోపులు

అందుబాటులోకి రావాలని ఆకాంక్ష

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 1.68 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా అందులో 3.38 లక్షల టన్నుల ఎండు గడ్డి లభించవలసి ఉంది. అయితే 90 శాతం మేర వరికోత యంత్రాల సాయంతోనే రైతులు మాసూళ్లు చేయడంతో కేవలం 2.5 లక్షల టన్నుల ఎండుగడ్డి మాత్రమే లభిస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. గతంలో మాదిరిగా పొలాల్లోని గడ్డిని తగులబెట్టకుండా కొంతమంది రైతులు మాత్రం స్ట్రాబేలర్ యంత్రాన్ని వినియోగించుకుని గడ్డిని సేకరించుకుంటున్నారు. స్ట్రాబేలర్ యంత్రంతో సేకరిస్తే ఎకరాకు దాదాపు రెండు టన్నుల గడ్డి లభిస్తుంది. స్ట్రాబేలర్ యంత్రం 20 కేజీల చొప్పున మూట కట్టిన గడ్డిమోపులను పొలంలోనే పడవేస్తుంది. ఎకరాకు సుమారు 90 నుంచి 105 వరకూ గడ్డి మోపులు లభిస్తున్నాయి. తమ పొలాల్లో సేకరించే ఎండుగడ్డిని మోపుల రూపంలో గడ్డిమేట్లు వేసుకుని పశువుల దాణాగా అందించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఇతర పాడి రైతులు ఒక్కొక్క గడ్డిమోపునకు రూ.30 చొప్పున ధర రైతుకు చెల్లించి తీసుకువెళుతున్నారు. వరికోత యంత్రాల మాదిరిగానే స్ట్రాబేలర్ యంత్రాలు విరివిగా అందుబాటులోకి రావాలని పాడి రైతులు ఆకాంక్షిస్తున్నారు.

కాలుష్యాన్ని నివారించవచ్చు



వరి చేలల్లో పండించిన పంటను తీసుకుని అందులో వదిలేసిన గడ్డిని తగులబెట్టకుండా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో కాలుష్యాన్ని నివారించడంతో పాటు పశుగ్రాసం కొరత తీరుతుంది. గడ్డిని తగులబెట్టడం వల్ల కలిగే అగ్ని ప్రమాదాలను అరికట్టవచ్చు.

– కె.నాగేశ్వరరరావు, వ్యవసాయశాఖ ఏడీ, అలమూరు

ఎండు గడ్డి కొరత తీరనుంది



ట్రాక్టర్‌కు వెనుక భాగాన స్ట్రాబేలర్ యంత్రాన్ని అనుసంధానం చేసి గడ్డిని సేకరించడం వల్ల పశుగ్రాసం కొరత నుంచి ఉపశమనం కలుగుతుంది. ట్రాక్టర్ యజమానులకు ఈ యంత్రాన్ని రాయితీపై ఇస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

– ఆకుల రామకృష్ణ పాడి రైతు, మోదుకూరు

జెండా పాతిన బరితెగింపు

సామర్లకోట: మండల పరిధిలో వీకే రాయపురం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించే కోడి పందేలకు రంగం సిద్ధం అవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీ, జనసేన నాయకులు కలిసి కోడిపందేలు నిర్వహించాలని భావించారు. అయితే తెలుగుదేశం నాయకులు ప్రత్యేకంగా కోడిపందేలు నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. దాంతో జనసేన గ్రామ నాయకుడు పెదిరెడ్ల కొండలరావు ఆధ్వర్యంలో కోడిపందేలకు బరి తయారు చేస్తున్నారు. జనసేన నాయకులకు పార్టీ అధ్యక్షుడు తుమ్మలబాబు అండ ఉండటంతో జనసేన నాయకులు ఉత్సాహంగా కోడి పందేల బరి తయారు చేయడంతో పాటు ఆ బరి వద్ద జనసేన జెండా ఏర్పాటు చేశారు. దాంతో తెలుగుదేశం, జనసేన నాయకుల్లో విభేదాలు పొడచూపుతున్నాయి.

ట్రాక్టరు సాయంతో తయారు చేసిన బరిలో పాతిన జనసేన జెండా →



టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ


పురుషుల విభాగంలో పోటీ పడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడాస్ఫూర్తితో పోటీల్లో రాణించాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరావు (నానాజీ) పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ సురేష్ నగరంలోని శ్రీప్రకాష్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీల ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర టేబుల్ టెన్నిస్ సంఘ అధ్యక్షుడు భాస్కర్‌రాం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడారు. టేబుల్ టెన్నిస్ జాతీయస్థాయి ఆటగాడు, కోచ్ భీష్మ పితామహ బిరుదు గ్రహీత ముక్కామల ఫొటోకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు 12 జిల్లాల నుంచి 230 మంది హాజరయ్యారు. అనంతరం అతిథిలు పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఏపీ టేబుల్ టెన్నిస్ సంఘ గౌరవ అధ్యక్షుడు రావు చిన్నారావు, కార్యదర్శి విశ్వనాథ, శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ విజయప్రకాష్, బీవీ కృష్ణారావు, సీపోర్ట్సు సీఈఓ మురళీధర్, జిల్లా టేబుల్‌టెన్నిస్ సంఘ కార్యదర్శి మోహన్‌బాబు పాల్గొన్నారు.



కట్న కానుకలకు మంగళం!

- సత్యదేవుని నిత్య కల్యాణంలో ఆగిపోయిన ఆచారం
- పునరుద్ధరిస్తే మేలంటున్న భక్తులు

అన్నవరం: సత్యదేవుని నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామి, అమ్మవారికి కట్న కానుకలు సమర్పించే సంప్రదాయానికి పురోహితులు, అర్చకులు, సిబ్బంది మంగళం పలికారు. రత్నగిరిపై ప్రతీరోజు స్వామి, అమ్మవారికి కల్యాణం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ కల్యాణంలో పాల్గొనే భక్తులు స్వామి, అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించడం, కల్యాణం అనంతరం స్వామి, అమ్మవారికి కట్న కానుకలు సమర్పించే ఆచారం పూర్వం నుంచీ ఉంది. కొన్నేళ్లుగా ఈ ఆచారం పాటించకపోవడంతో 2023 సంవత్సరంలో అప్పటి ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆగస్టు 13వ తేదీ నుంచి భక్తులు కట్నకానుకలు సమర్పించే విధానాన్ని పునరుద్ధరించారు. దీంతో కల్యాణం చేయించే భక్తులనుద్దేశించి అర్చకస్వాములు, పురోహితులు స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు సమర్పించవచ్చునని, కట్నకానుకలు చదివించాలని ప్రకటించడంతో ప్రతి రోజూ భక్తులు కట్నకానుకలు చదివించేవారు. నూతన పట్టు వస్త్రాలు దేవస్థానం వద్ద కొని వాటిని స్వామి, అమ్మవార్లకు సమర్పించేవారు. గతేడాది ఆగస్టు నుంచి ప్రతి నెలా సుమారు రూ.లక్ష కట్నకానుకల రూపంలో, రోజూ పదుల సంఖ్యలో నూతన వస్త్రాలు స్వామికి వచ్చాయి. రూ.500, అంతకన్నా ఎక్కువ మొత్తాలను రికార్డులో రాసి వారి గోత్రనామాలను పండితులు చదివి ఆశీర్వదించేవారు. అంతకు తక్కువ అయితే ఆ మొత్తాన్ని హుండీలో వేసేవారు. ఈ విధంగా 2023 సంవత్సరంలో దేవస్థానానికి సుమారు రూ.ఐదు లక్షల ఆదాయం సమకూరింది. ఆ తరువాత కట్న కానుకల చదివింపు కార్యక్రమాన్ని నిలుపుదల చేసి కేవలం పట్టు వస్త్రాల సమర్పణ మాత్రమే కొనసాగిస్తున్నారు. దీనిపై నిత్యకల్యాణం సిబ్బందిని ప్రశ్నిస్తే కట్న కానుకలు ఆపేశామని తెలిపారు. అధికారులు ఈ కట్న కానుకల చదివింపును పునరుద్ధరిస్తే దేవస్థానానికి ఆదాయంతో బాటు భక్తులు సంతృప్తి చెందుతారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.


స్వామివారి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

వృద్ధురాలి సజీవ దహనం?



సామర్లకోట: స్థానిక 27వ వార్డులో శుక్రవారం ఒక వృద్ధురాలు విక్రం అచ్చియ్యమ్మ (90) సజీవ దహనం అయినట్టు తెలిసింది. వృద్ధురాలి ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. మధ్యాహ్నం భోజనం చేశాక చుట్ట కాలుస్తూ మంచంపై నిద్రించడంతో సజీవ దహనం అయినట్టు కొందరు చెబుతున్నారు. టీ కాస్తుండగా అదుపు తప్పి పొయ్యిలో పడిపోవడంతో సజీవ దహనం అయిందని మరికొందరు అంటున్నారు. ఇంటిలో నుంచి పొగ రావడంతో స్థానికులు వెళ్లి చూడగా మంచం కింద వృద్ధురాలి మృతదేహం ఉన్నట్టు గుర్తించారు. విషయం తెలిసిన ఆమె బంధువులు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. దీనిపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

← మంచం కింద అచ్చియ్యమ్మ మృతదేహం

విశాఖకు ఓవరాల్ చాంపియన్ షిప్

ముగిసిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు

పిఠాపురం: రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్ విశాఖపట్నం జిల్లా సాధించింది. ఈ నెల 19, 20 తేదీల్లో పిఠాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ మెన్ బాక్సింగ్ పోటీలో విశాఖపట్నం మొదటి స్థానంలో, శ్రీకాకుళం జిల్లా రెండో స్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో 10 మంది బాక్సర్లు స్వర్ణ పతకాలు సాధించారు. ఈ బాక్సర్స్ జనవరి 6 నుంచి 14వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయస్థాయి మెన్ బాక్సింగ్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొంటారని ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.లక్ష్మణరావు తెలిపారు. పిఠాపురం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ జిల్లా స్పోర్ట్సు డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్‌కుమార్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత డాక్టర్ ఐ వెంకటేశ్వరరావు, ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ బీఏ లక్ష్మణ్ దేవ్ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కౌన్సిలర్ రాయుడు శ్రీనివాసరావు, అలవరపు నగేష్, కేతవరపుకృష్ణ, ఆర్ఆర్బీ హెచ్ఆర్ హైస్కూల్ వైస్ చైర్మన్ సూర్యవతి పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ తదితరులు

పురుగు మందు తాగిన విద్యార్థిని మృతి


నైపుణ్య (ఫైల్)

కొత్తపల్లి: తల్లి మందలించిందని కోపంతో పురుగుల మందు తాగి అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి చెందినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. మండలంలోని రమణక్కపేట గ్రామానికి చెందిన చింతపల్లి నైపుణ్య(16) స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన పరీక్షల్లో మార్కులు తక్కువగా వస్తున్నాయని ఉపాధ్యాయులు బాలిక తల్లి సుభాషిణికి సమాచారం ఇచ్చారు. దీంతో ప్రతీ రోజు పాఠశాలకు వెళుతున్నావు, బాగా చదువుకోవాలని తల్లి గట్టిగా మందలించడాన్ని తట్టుకోలేని విద్యార్థి గురువారం ఉదయం కూరగాయలకు కొట్టే పురుగుల మందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. దీనిపై ఎస్సై వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ప్రశాంతంగా సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలు


స్టాక్ పాయింట్ల నుంచి ప్రశ్నాపత్రాలను అందజేస్తున్న డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): వారం రోజులుగా జరుగుతున్న సెల్ఫ్ అసెస్మెంట్ టర్మ్ -1 పరీక్షలు గురువారంతో పూర్తయినట్టు అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ తెలిపారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్ వద్ద పూర్తి బందోబస్తు మధ్య ప్రశ్నపత్రాలను ఉంచి, పరీక్ష సమయానికి గంట ముందు పాఠశాలలకు పంపించినట్టు తెలిపారు. అర్బన్ మండలంలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు. సీఆర్ఎంటీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నన్నయలో చైల్డ్ సైకాలజీ కోర్సు

ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య శ్రీనివాసరావు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డిపార్టుమెంట్ ఆఫ్ సైకాలజీ ఆధ్వర్యంలో చైల్డ్ అండ్ అడాల సెంట్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ పీజీ డిప్లమా కోర్సును ఆసక్తి ఉన్నవారంతా సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ కోర్సుకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఇంతవరకు రెండు బ్యాచ్‌లు పూర్తయ్యాయని, ప్రస్తుతం మూడో బ్యాచ్ కోసం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. ఏడాది కాలపరిమితితో కూడిన ఈ కోర్సులో 40 సీట్లు ఉన్నాయని, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఏ ఇతర యూనివర్సిటీలోనూ ఈ కోర్సు లేదన్నారు. ఈ కారణంగా మంచి డిమాండ్‌తో నడుస్తున్న ఈ కోర్సులో చేరేందుకు ఆసక్తి ఉన్నవారు వచ్చే నెలలోగా దరఖాస్తు చేసుకుని, 22న జరిగే కౌన్సెలింగ్‌కి హాజరుకావొచ్చన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ని సందర్శించవచ్చని, లేకుంటే 92462 879898 ఫోన్ చేయవచ్చునని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్, ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.విజయనిర్మల, డీన్ ఆచార్య కేవీ స్వామి, కోఆర్డినేటర్ డాక్టర్ నక్కిన నారాయణ, డాక్టర్ పడాల రాజశేఖర్, డాక్టర్ సీహెచ్ భవానీ పాల్గొన్నారు.